బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 14 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4

## 31 వరకు ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

బలగం టీవీ, హైదరాబాద్

లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) 25 శాతం రిబేట్, ఫీజు చెల్లింపు గడువును మే 31 వతేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎమ్ దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ గడువు మే 3వ తేదీతో ముగిసిన విషయం తెలిసిందే. ఈ స్కీం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆశించిన మేర నిధులు సమకూరలేదు. దీనితో ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించారు. తాజాగా మే 3 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక సంఘాలతో డీటీసీపీ లే అవుట్లకు కూడా 25 శాతం రిబేటు వర్తింస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వన్‌టైం సెటిల్‌మెంటును ప్రభుత్వం ప్రకటించింది. దానికి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. దీనితో ఫీజులో 25 శాతం రాయితీ ఇస్తూ, మార్చి 31వరకు గడువు విధించారు. ఆ తర్వాత దాన్ని ఏప్రిల్ 30 వరకు, మరోసారి మే 3వ తేదీ వరకు గడువును పొడిగించారు. తాజాగా మే 31వరకు మరోసారి గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తడం, ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో రాయితీ గడువును మళ్లీ మళ్లీ పొడిగిస్తున్నట్టు సమాచారం. 2020లో ప్రారంభమైన లే అవుట్ క్రమబద్ధీకరణ పథకానికి 25.67 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారిలో 40 శాతం మందికి అధికారులు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. అయితే 5.19 లక్షల మంది మాత్రమే ఏప్రిల్ 30 నాటికి చెల్లింపులు పూర్తి చేశారు. ఈ పథకం ద్వారా రూ.20 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం ఆశించింది. అయితే ఇప్పటివరకు రూ.1,863 కోట్లు మాత్రమే వచ్చినట్టు అధికారులు తెలిపారు.

# భారత్‌పై కన్ను వేస్తే నాశనం తప్పదు

- అది ఉగ్రవాదానికి ఊతం ఇచ్చే దేశాలు గ్రహించాయి
- మన డ్రోన్లు, మిస్సైళ్ల గురించి ఆలోచిస్తే.. పాకిస్థాన్‌కు నిద్రపట్టదు
- ఆపరేషన్ సింధూర్‌తో మన ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నాం
- భారత్ మాతా కీ జై అన్నది కేవలం నినాదం కాదు
- దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసే సైనికుల ప్రతిజ్ఞ
- ప్రతి ఉగ్రవాద దాడికి.. బలమైన రీతిలో రిప్లై ఉంటుంది
- అదంపూర్ ఎయిర్‌బేస్‌లో ప్రధాని మోడీ



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో


భారత్‌పై కన్ను వేస్తే నాశనం తప్పదని.. ఉగ్రవాదానికి ఊతం ఇచ్చే దేశాలు గ్రహించాయని ప్రధాని మోడీ అన్నారు. మన డ్రోన్లు, మిస్సైళ్ల గురించి ఆలోచిస్తే.. పాకిస్థాన్‌కు నిద్రపట్టదన్నారు. మన ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌కు సెల్యూట్ చేస్తున్నట్టు చెప్పారు. మనం ప్రదర్శించిన సాహసం వల్లే.. ప్రపంచ దేశాలకు ఆపరేషన్ సింధూర్ సక్సెస్ వినిపించిందన్నారు. అదంపూర్ ఎయిర్‌బేస్‌ను విజిట్ చేసిన ప్రధాని మోడీ అక్కడ జరిగిన కార్యక్రమంలో సైనికుల్ని ఉద్దేశించి ప్రసంగించారు.

భారత్ మాతా కీ జై అన్నది కేవలం నినాదం కాదు అని, దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసే సైనికుల ప్రతిజ్ఞ అని పేర్కొన్నారు. మన డ్రోన్లు, మిస్సైళ్ల శత్రు దేశాన్ని తాకినప్పుడు, వాళ్లకు భారత్ మాతా కీ జై వినబడుతుందన్నారు. అణ్వాయుధ దాడి చేస్తామని బెదిరింపులకు పాల్పడిన వాళ్లను మన సైనిక బలగాలు చుట్టేశాయని, అప్పుడు మన శత్రువులకు భారత మాతా కీ జై నినాద ప్రాముఖ్యత అర్థమైందన్నారు. మీరు చూపిన తెగువ, ధైర్యసాహసాలను అభినందించేందుకు ఇక్కడకు వచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. మీరు చూపిన ధైర్యాన్ని భవిష్యత్తులో చరిత్రగా చెబుకుంటారన్నారు. మన ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌కు సెల్యూట్ చేస్తున్నట్లు చెప్పారు. మనం ప్రదర్శించిన సాహసం వల్లే.. ప్రపంచ దేశాలకు ఆపరేషన్ సింధూర్ సక్సెస్ వినిపించిందన్నారు.

మనది గౌతమ బుద్ధుడు, గురు గోబింద్ సింగ్ పుట్టిన పుణ్యదేశమని, మన శత్రువులు మన సైనిక బలగాలను మరిచి మనల్ని సవాల్ చేశారన్నారు. భారత్‌పై కన్ను వేస్తే నాశనం తప్పదని.. ఉగ్రవాదానికి ఊతం ఇచ్చే దేశాలు గ్రహించాయన్నారు. పాకిస్థాన్ ఆర్మీని మన త్రివిధ దళాలు చావు దెబ్బతీశాయని, శత్రు దేశానికి దాని స్థానాన్ని చూపించాయన్నారు. మన డ్రోన్లు, మిస్సైళు చేసిన ఆపరేషన్‌ను చూసి.. పాకిస్థాన్‌కు చాలా కాలం నిద్ర పట్టదన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో మనం మన ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నామన్నారు. ప్రజల్లో ఐకమత్యం పెరిగిందన్నారు. పాకిస్థాన్ లోపల ఉన్న ఉగ్రవాద కేంద్రాలను ఐఏఎఫ్ టార్గెట్ చేసిందని, చాలా వేగంగా, కచ్చితత్వంతో ఆ దాడి జరిగిందని, శత్రు దేశం ఆ దాడితో స్టన్ అయ్యిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

పాకిస్థాన్ విషయంలో మన లక్ష్మణ రేఖ క్లియర్‌గా ఉందని, ప్రతి ఉగ్రవాద దాడికి.. బలమైన రీతిలో రిప్లై ఉంటుందన్నారు. ఉగ్రవాదానికి అండగా ఉన్న గాడ్‌ఫాదర్ దేశాలను, స్పాన్సర్ దేశాలను వేరుగా చూడబోమన్నారు. ఆపరేషన్ సింధూర్‌లోని ప్రతి సందర్భం మన సైనిక బలగాల శక్తికి నిదర్శనమన్నారు. మన త్రివిధ దళాల ఆధిపత్యాన్ని చాటుతుందన్నారు. పాకిస్థాన్ మనపై దాడి చేసేందుకు తీవ్ర ప్రయత్నం చేసిందని, కానీ మన ఎయిర్‌బేస్‌లు, డిఫెన్స్ మౌళిక సదుపాయాలకు ఎటువంటి నష్టం జరగలేదని ప్రధాని తెలిపారు.

## రుతుపవనాలు వచ్చేశాయ్..!




- అండమాన్, బంగాళాఖాతంలో ప్రవేశం
- మూడు నాలుగు రోజులలో విస్తరణ
- 27న కేరళకు..
- ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతమే

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నైరుతి రుతు పవనాలు మంగళవారం దేశంలో ప్రవేశించాయి. దక్షిణ బంగాళాఖాతం, దక్షిణ, ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతాలు, నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాలను నైరుతి రుతుపవనాలు తాకాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) ప్రకటించింది. రాబోయే మూడు నాలుగు రోజులలో రుతుపవనాలు మరింతగా విస్తరిస్తాయని పేర్కొంది. దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు %-% కొమోరిన్ ప్రాంతాలు, దక్షిణ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, అండమాన్ నికోబార్ దీవులు, అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే 3,4 రోజులలో రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వివరించింది. రుతుపవనాల రాకతో ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదవు తుందని అంచనా వేసింది. దిగువ వాతావరణ స్థాయిలలో పశ్చిమ గాలులు బలంగా ఉండడం, ఎగువ వాతావరణ స్థాయిలలో తూర్పు గాలులు బలంగా ఉండడం, దక్షిణ ద్వీపకల్పంలో 40 రోజుల పాటు ఉరుములతో కూడిన వర్షపాతం నమోదు కావడం, వాయవ్య పసిఫిక్ మహా సముద్రంలో సాధారణం కంటే ఎక్కువ పీడనం వుండడం%ా% కేరళను రుతుపవనాలు ముందుగానే తాకబోతున్నట్లు సంకేతాలు ఇస్తున్నాయని ఐఎండి తెలిపింది.

## ఎలాంటి పదవులు స్వీకరించను

- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా
- సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ
- నేడు నూతన సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బీఆర్ గవాయ్



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

పదవీ విరమణ తర్వాత తాను ఎలాంటి అధికారిక పదవులు చేపట్టబోనని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. తాను న్యాయవ్యవస్థలోనే ఏదైనా చేయాలని అనుకుంటున్నానని చెప్పారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా పదవీకాలం మంగళవారంతో ముగిసింది. దాంతో తన ఆఖరి రోజు కోర్టులో బెంచ్ కార్యలాపాలు ముగియగానే సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

కాగా జస్టిస్ సంజీవ్ ఖన్నా గతేడాది నవంబర్ 11న భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు మాజీ న్యాయమూర్తి, దివంగత జస్టిస్ హెచ్ఆర్ ఖన్నా సమీప బంధువు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులైన సంజీవ్ ఖన్నా ఆ మరుసటి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, 2024 నవంబర్ 11న సీజేఐగా బాధ్యతలు చేపట్టారు.సంజీవ్ ఖన్నా పదవీ విరమణతో భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు. మే 14న ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నూతన సీజేఐతో ప్రమాణస్వీకారం చేయిస్తారు. సీనియారిటీపరంగా తన తర్వాత స్థానంలో ఉన్న జస్టిస్ గవాయ్ పేరును ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా గతంలోనే సిఫారసు చేయడంతో కేంద్రం ఆమోదం తెలిపింది. జస్టిస్ గవాయ్ పదవీకాలం నవంబర్ 23న ముగియనుంది.

మరోవైపు తదుపరి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు. బుధవారం ఆయన 52వ సీజేఐగా ప్రమాణం చేయనున్నారు.

## అప్పటివరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేత



- జమ్ముకశ్మీర్ విషయంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదు
- ద్వైపాక్షిక చర్చలు తప్ప ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని భారత్ అంగీకరించదు
- విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

మ్ముకశ్మీర్ విషయంలో భారత్ విధానంలో ఎలాంటి మార్పు లేదని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. కాల్పుల విరమణ ప్రతిపాదన పాకిస్థాన్ నుంచే వచ్చిందని వివరించారు. పీవోకే నుంచి పాక్‌ను ఖాళీ చేయించడమే మిగిలి ఉందన్నారు. సీమాంతర ఉగ్రవాదానికి పాక్ మద్దతు నిలిపివేసే వరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిస్థితులపై మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రణ్‌ధీర్ జైస్వాల్ ఈ వివరాలు వెల్లడించారు.

భారత్‌తోపాటు ప్రపంచ దేశాల్లోని అమాయకులను పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు బలితీసుకున్నారని మండిపడింది. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు నిలిపివేసే వరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని స్పష్టంచేసింది. జమ్ముకశ్మీర్ విషయంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని చెప్పారు. ద్వైపాక్షిక చర్చలు తప్ప ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని భారత్ అంగీకరించదని తెగేసి చెప్పారు. పీవోకేను పాకిస్థాన్ ఖాళీచేసే అంశం మాత్రమే మిగిలి ఉందని అన్నారు. కాల్పుల విరమణపై తమ వైఖరి సుస్పష్టమని, ప్రపంచ దేశాల నుంచి తమతో సంప్రదింపులు జరిపిన వారందరితోనూ ఇదే విషయాన్ని చెప్పామని జైశ్వాల్ తెలిపారు. ఉగ్రవాదులను అణచివేయడమే భారత్ ప్రాథమిక లక్ష్యమన్నారు. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ దాడిచేస్తే.. ప్రతిగా పాకిస్థాన్ దుస్సాహసానికి దిగిందని చెప్పారు. అందుకు ప్రతిచర్యగానే భారత్ పాకిస్థాన్‌పై దాడులు చేసిందన్నారు. పాకిస్థాన్ కాల్పులు నిలిపివేస్తే భారత్ దాడులు ఆపేస్తుందని, వాళ్ల కవ్విస్తే తాము అంతకు రెండింతలు దెబ్బకొడుతామని, ఇదే విషయాన్ని తాము ప్రపంచ దేశాలకు స్పష్టం చేశామని రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు.

బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ పార్టీని నిషేధించడంపై భారత్ ఆందోళన తెలిపింది. ప్రజాస్వామ్య స్వేచ్ఛను బలహీన పరిచే ఇబ్బందికర పరిణామంగా దీనిని పేర్కొంది. సరైన ప్రక్రియను పాటించకుండా అవామీ లీగ్‌పై నిషేధం విధించడం ఆందోళన కలిగించే పరిణామమని చెప్పారు. ప్రజాస్వామ్య హక్కులను, రాజకీయ పార్టీలకున్న అవకాశాన్ని కుదించడం సహజంగానే ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు ఆందోళన కలిగించే విషయమని అన్నారు. బంగ్లాదేశ్‌లో సాధ్యమైనంత త్వరగా స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరిగేందుకు భారత్ మద్దతిస్తుందని చెప్పారు.

## పాక్ హైకమిషన్ ఉద్యోగిని బహిష్కరించిన భారత్

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ కొనసాగుతున్న వేళ భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ హైకమిషన్ ఉద్యోగిని దేశం నుంచి బహిష్కరించింది. 24 గంటల్లోగా భారత్ నుంచి వెళ్లిపోవాలని ఆదేశం జారీ చేసింది. ఈ మేరకు భారత విదేశాంగశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. గూఢచర్య కార్యకపాలకు పాల్పడుతునే ఆరోపణలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత్‌లో పాకిస్థాన్ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న అధికారికి భారత విదేశాంగ శాఖ ఓ లేఖ రాసింది. అయితే, ఆ అధికారి పేరును మాత్రం వెల్లడించలేదు. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగిని దేశ బహిష్కరణ చేయాలని నిర్ణయించామని విదేశాంగ శాఖ తెలిపింది. అధికార హెూదాకు తగ్గట్లు ప్రవర్తించలేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొంది. 24 గంటల్లోగా సదరు అధికారి భారత్ విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఆ అధికారిని భారత ప్రభుత్వం పర్సనా నాన్ గ్రాటాగా ప్రకటించింది. ఈ మేరకు పాకిస్థాన్ హైకమిషన్ ఛార్జ్ డి అఫైర్స్?కు మంగళవారం ఆదేశాలు జారీ చేశామని మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో ఓ వ్యక్తి దౌత్య అధికారిగా ఉన్న సమయంలో ఏమైనా విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే పర్సనా నాన్ గ్రాటాగా పరిగణించి దేశం నుంచి బహిష్కరిస్తారు. కాగా, పహల్గాం ఉగ్రవాది తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల పరిస్థితులు నెలకొన్నాయి. ఉగ్రవాదం అంతమే లక్ష్యంగా పాక్?పై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు చేసింది. ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది.

## పహల్గాం ఉగ్రవాదులను పట్టిస్తే రూ.20 లక్షలు

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

గత నెల పహల్గాంలో 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ముగ్గురు ఉగ్రవాదుల ఆచూకీ తెలియజేస్తే రూ.20 లక్షల బహుమతి ఇస్తామంటూ మంగళవారం అధికారులు ప్రకటించారు. ఈ మేరకు జమ్ముకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో పోస్టర్లు వెలిశాయి. పహల్గాం దాడికి కారకులుగా భావిస్తున్న పాకిస్థాన్‌కు చెందిన ఆసిఫ్ ఫౌజీ, సులేమాన్ షా, అబూ తల్హాల ఫొటోలతో పాటు ఉర్దూలో రాసిన ఈ పోస్టర్లలో వీరి గురించి సమాచారం, ఆచూకీ తెలియజేస్తే భారీ బహుమతి ఇస్తామని అధికారులు పేర్కొన్నారు.

## కేటీఆర్ నాయకత్వాన్ని స్వాగతిస్తా



- పాకిస్తాన్‌ను నమ్మి అప్పు ఇస్తున్నారు కానీ.. రేవంత్ రెడ్డిని నమ్మి అప్పు ఇవ్వడం లేదు
- మాపార్టీలో ఎలాంటి పంచాయితీ లేదు
- రుణమాఫీ, రైతుబంధుపై సీఎం ఎందుకు రివ్యూ చేయటం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

బలగం టీవీ, హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీలో నాయకత్వ మార్పుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ కి నాయకత్వం అప్పగిస్తే తాను తప్పకుండా స్వాగతిస్తానని ఆయన స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. తాను ఇప్పటికే చాలాసార్లు చెప్పానని, ఎన్నిసార్లు అడిగినా ఇదే చెప్తానని అన్నారు. కేసీఆర్ తమ అధ్యక్షుడని, ఆయన చెప్పినట్లు తూచా తప్పకుండా పాటిస్తానని చెప్పారు. ఒక కార్యకర్తగా పార్టీ నిర్ణయాన్ని, కేసీఆర్ నిర్ణయాన్ని ఎల్లప్పుడూ శిరసావహిస్తానని ఆయన స్పష్టం చేశారు.

సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేటీఆర్ నాయకత్వంపై అనేక సార్లు నా అభిప్రాయాన్ని చెప్పానని, మాపార్టీలో ఎలాంటి పంచాయితీ లేదని స్పష్టం చేశారు. తాను పార్టీ మారు తానని జరుగుతోన్న చిల్లర ప్రచారాన్ని బంద్ చేయాలని ఆయన సూచించారు. కేటీఆర్ కు బీఆర్ఎస్ నాయకత్వ భాధ్యలు అప్పగిస్తే స్వాగతిస్తానని, క్రమశిక్షణ గల కార్యకర్తగా కేసీఆర్ ఆదేశాలను

మిగితా 2వ పేజీలో

## హాస్టల్ విద్యార్థులకు స్మార్ట్‌కార్డులు



బలగం టీవీ, హైదరాబాద్

ప్రభుత్వ హాస్టళ్లలో వసతి పొందే విద్యార్థులకు డెబిట్ కార్డు తరహాలో స్మార్ట్ కార్డుల్ని ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు అధికారుల్ని ఆదేశించారు. దానితో పాటే కాస్మోటిక్ చార్జీలను నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేందుకు అవసరమైన ప్రతిపాద నలు సిద్ధం చేయాలని చెప్పారు. దీనివల్ల విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. మంగళవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సాంఘీక, గిరిజన, మైనార్టీ వసతి గృహాల నిర్వహణపై ఉన్నతస్థాయి అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వారికి కావల్సిన సబ్బులు, కాస్మోటిక్ వస్తువుల కొనుగోళ్లకు మహిళా సంఘాలు నిర్వహిస్తున్న మొబైల్ విక్రయకేంద్రాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి హాస్టళ్లకు సరిపడా సరుకులు, విద్యార్థుల టెక్స్ట్‌బుక్స్, నోట్ బుక్స్, యూనిఫాంలు, బెడ్‌షీట్లు, కార్పెట్లు, స్కూల్‌బ్యాగ్‌లు సహా అవసరమైన సామాగ్రి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. వస్తువులు, సరుకుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడొద్దని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సీ డెవలప్‌మెంట్ ముఖ్యకార్యదర్శి ఎన్ శ్రీధర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఏ వర్షిణి, సెర్ప్ సీఇఓ దివ్య, బీసీ వెల్ఫేర్ సెక్రటరీ ఇ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## 11 మంది మా సైనికులు మృతి

- పాకిస్థాన్

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్‌ల మధ్య వరుసగా నాలుగు రోజుల పాటు దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 11 మంది సైనికులు మరణించారని పాకిస్థాన్ సైన్యం వెల్లడించింది. మరో 78 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. వీరిలో సైనికులతో పాటు ఎయిర్ ఫోర్స్ సిబ్బంది సైతం ఉన్నారని పాకిస్థాన్ ఆర్మీ వివరించింది. గాయపడిన వారు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పింది. ఈ మేరకు పాకిస్థాన్ ఆర్మీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

## 25న పాలిసెట్ ఫలితాలు

బలగం టీవీ, హైదరాబాద్

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ పాలిసెట్ ఫలితాలు ఈ నెల 25న విడుదలకానున్నాయి. అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. మంగళవారం పాలిసెట్ పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. 1,06,716 మంది దరఖాస్తు చేసుకోగా 98,858 మంది పరీక్షకు హాజరైనట్టు సాంకేతిక విద్యామండలి కార్యదర్శి పుల్లయ్య ప్రకటనలో తెలిపారు. బాలురు 92.84%, బాలికలు 92.4% చొప్పున పరీక్షకు హాజరైనట్టు ఆయన వెల్లడించారు.

ఇక రెండేండ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎడ్‌సెట్ దరఖాస్తుల గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్టు కన్వీనర్ ప్రొఫెసర్ బీ వెంకట్రామ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆలస్య రుసుము లేకుండా అభ్యర్థులు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జూన్ 1న ఎడ్‌సెట్ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.



## చార్మినార్ వద్ద సుందరాంగుల హెరిటేజ్ వాక్

ఆకట్టుకున్న హెరిటేజ్ వాక్

చౌమహల్లా ప్యాలెస్‌లో డిన్నర్

వివరాలు 4వ పేజీలో

# వరంగల్ సభతో కాంగ్రెస్ పతనం ఆరంభమైంది

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో నిర్వహించిన కీలక సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. వరంగల్‌లో జరిగిన సభతో.. కాంగ్రెస్ పార్టీ పతనానికి ప్రారంభమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తుందని, వారి హామీలను అమలు చేయకపోవడం ద్వారా వారి నిజస్వరూపం బహిర్గతమైందని విమర్శించారు. తెలంగాణను పీడిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ వరుస పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ అరాచకాలను ఎదుర్కొనే శక్తి ఒక్క బీఆర్ఎస్‌కే ఉందని, రైతుల సమస్యల పరిష్కారం కోసం విస్తృత స్థాయిలో పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



"రైతుల ఆత్మహత్యలు, వారి సమస్యలపై కాంగ్రెస్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. తెలంగాణ రైతాంగాన్ని రక్షించడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైంది. మోసానికి మారుపేరైన కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ప్రజలకు వివరించాల్సిన, ఆసన్నమైంది," అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజలకు వివరిస్తుందని, వాటిని బహిర్గతం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల హక్కులను రక్షించేందుకు ఎప్పటికప్పుడు పోరాటాలను నిర్వహిస్తుందని కేటీఆర్ పునరుద్ఘాటించారు.

# కేటీఆర్ నాయకత్వాన్ని స్వాగతిస్తా

(మొదటి పేజీ తరువాయి)

తూచా తప్పక పాటిస్తానని క్లారిటీ ఇచ్చారు.

రేవంత్ సర్కార్‌పై హరీష్ రావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం అమ్మకోవటానికి రైతులు కల్లాల్లో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ధాన్యం రాశులను వదిలేసి.. రేవంత్ అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శలు గుప్పించారు. అందాల పోటీల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా ఉంటున్నారని.. పాకిస్తాన్‌ను నమ్మి అప్పు ఇస్తున్నారు కానీ.. రేవంత్ రెడ్డిని నమ్మి అప్పు ఇవ్వడం లేదని సెటైర్లు వేశారు. రుణమాఫీ, రైతుబంధుపై సీఎం ఎందుకు రివ్యూ చేయటం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో రైతుల మరణాలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని, చనిపోయిన రైతులకు 25లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయనందుకు తెలంగాణ రైతులకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో, ఢిల్లీకి డబ్బులు పంపటంలో రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని.. 48గంటల్లో కాదు కదా.. నెల రోజులకు కూడా రైతులకు డబ్బులు పడటం లేదని, ఐదు పైసలు కూడా బోనస్ కింద విడుదల చేయలేదని మండిపడ్డారు. పెట్టుబడి సాయం మెల్లగా.. ఏడాది పొడవునా ఇస్తామని భట్టి చెప్పటం సిగ్గుచేటి దూషించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నీ బోగస్ అని నిప్పులు చెరిగారు. పది కిలోల తరుగు తీస్తున్నారని.. సీతక్క నియోజకవర్గంలో జట్టి రాజు ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతుల కష్టాలపై సీఎం రేవంత్ సమీక్ష చేయడని.. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ఉండి.. వడదెబ్బతో రైతులు చనిపోతున్నారని ధ్వజమెత్తారు.

తరుగు తీయబోమని మాటిచ్చిన సర్కారు ఆ మాట నిలబెట్టుకోలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో జెట్టి రాజు అనే రైతు క్వింటాల్‌కు 10 కిలోల తరుగు తీస్తున్నారని ఆవేదనతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఆన్‌లైన్ ట్రక్ షీట్ విధానం అమలు చేయడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక ఎండలో రోజుల తరబడి వేచి చూసి రైతులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మే 13న మహబూబాబాద్ జిల్లా పోచంపల్లిలో గుగులోతు కిషన్, ఏప్రిల్ 15న జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో జలపతి రెడ్డి, ఏప్రిల్ 21న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు చెర్లపాలెంలో హనుమండ్ల ప్రేమలత, ఏప్రిల్ 22న నెల్లికుదురు మండలం మదనతుర్తిలో బిర్రు వెంకన్న, ఏప్రిల్ 26న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో చింతకింది హనుమయ్య మరణించారని తెలిపారు. ఈ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేననీ, కేవలం కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగినవేనని మండిపడ్డారు. ఫిబ్రవరి నెలలో కట్టాల్సిన రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడం వల్ల చనిపోయిన రైతులకు రైతుబీమా అందడం లేదని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తుందని హెచ్చరించారు.

## వేసవి దృష్ట్యా వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- **మంత్రి కొండా సురేఖ**

**బలగం టీవి, హైదరాబాద్**

వేసవి దృష్ట్యా వన్యప్రాణుల సంరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని అధికారులను రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ, వన్యప్రాణి సంరక్షణ చర్యలపై ఉన్నతాధికారులతో కలిసి సీపీఎఫ్‌లు, డీఎఫ్ఓలతో మంత్రి సురేఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఏం పరికరాలు వాడుతున్నారని ఆరా తీశారు. ఒకేసారి పెద్ద అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని నివారించేందుకు అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయా? అని తెలుసుకున్నారు. ఏ జిల్లాలో ఎక్కువ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి? వాటి వల్ల వన్యప్రాణులు ఇబ్బందులు పడకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు? అని అడిగారు. వేసవి దృష్ట్యా అడవుల్లో, జూ లలో వన్యప్రాణుల, ఇతర జంతవులకు తగిన తాగునీటి సదుపాయాల కల్పించారా? అని ప్రశ్నించారు. వేసవిలో జంతువుల కోసం 2,168 నీటి గుంతలు ఏర్పాటు చేసి ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నట్టు అధికారులు వివరించారు.

నెహ్రూ, వరంగల్ జూ పార్కులలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. వన్యప్రాణులకు నీటి సౌకర్యం, ఆహారం విషయంలో అశ్రద్ధ వహించద్దని ఆదేశించారు. ప్రత్యేకంగా నీటి లభ్యత ఉన్న ఆహార పదార్థాలు, పండ్లను(దోసకాయ, పుచ్చకాయ వంటి) వాటికి ఆహారంగా అందజేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పీసీసీఎఫ్(హెఓఎఫ్ఎఫ్) డాక్టర్.సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఈలు సింగ్ మేరు, పీసీసీఎఫ్( స్కీమ్స్) జవహర్, వైల్డ్ లైఫ్ ఓఎస్డీ శంకరన్, నెహ్రూ జూ పార్క్ డైరెక్టర్ సునీల్ హీరామత్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 2,800 ఈవీ బస్సులకు యోచన

- **మంత్రి పొన్నం ప్రభాకర్**

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్‌లో 2,800 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని ఆర్టీసీ యోచిస్తున్నదని, దీనిపై ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడరీతో చర్చించామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 'బజాజ్ గోగో' సంస్థ కొత్తగా ఆవిష్కరించిన ఎలక్ట్రిక్ ఆటోలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తో ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని తెలిపారు.

## పాకిస్తాన్‌కు మరోసారి చురకలంటించిన అసదుద్దీన్

**బలగం టీవి, హైదరాబాద్**

పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైనిక చీఫ్ మునీర్లను ఉద్దేశించి 'ఎక్స్' వేదికగా ఒవైసీ చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'చైనా నుంచి అద్దెకు తెచ్చుకున్న విమానాన్ని పాకిస్థాన్ ప్రధానమంత్రి షరీఫ్, ఆర్మీ చీఫ్ మునీర్ తమ రహీమ్ యార్ ఖాన్‌ఎయిర్‌బేస్‌లో ల్యాండ్ చేయగలరా?' అని ప్రశ్నించారు. ఎందుకంటే ఆ ఎయిర్బేస్ ఇటీవల భారత్ చేసిన దాడుల్లో తీవ్రంగా ధ్వంసమైంది. తమ ఎయిర్ బేస్ లపై ఎలాంటి దాడి జరగలేదని ముందు బుకాయించిన పాక్ అనంతరం దాడులు నిజమేనని ఒప్పుకుంది. ఈ నేపథ్యంలోనే పాక్‌కు ఎద్దేవా చేస్తూ ఆయన ఈ ట్వీట్ చేశారు.

# సీబీఎస్ఈ 12 ఫలితాలు విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

సీబీఎస్ఈ 12, 10వ తరగతి పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో తెలంగాణ విద్యార్థులు సత్తాచాటారు. సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో ఈ సారి రికార్డుస్థాయిలో 99.73% ఉత్తీర్ణత నమోదయ్యిం ది. జాతీయంగా ఇదే రెండో అత్యధిక ఉత్తీర్ణత. రాష్ట్రం నుంచి బాలురు 99.6%, బాలికలు 99.80% పాస్ అయ్యారు. మన రాష్ట్రం నుంచి 146 పాఠశాలలకు చెందిన మొత్తం 8,477 మంది ఫీజు చెల్లించగా, 8,443 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.వీరిలో 8,420 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. రాష్ట్రాలవారీగా తీసుకుంటే మేఘాలయ 100%, తెలంగాణ 99.73%, ఏపీ 99.51%, కేరళ 99.32% ఉత్తీర్ణతతో టాప్ నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు నిర్వహించారు. జాతీయంగా 16,92,794 మంది పరీక్షలు రాయగా 14,96,307 మంది ఉత్తీర్ణులయ్యారు. సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో తెలంగాణ విద్యార్థులు 99.83% ఉత్తీర్ణులయ్యారు. 51,521 మంది పరీక్ష రా యగా 51,433 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 99.86%, బాలురు 99.80% ఉత్తీర్ణులయ్యారు.

# డుప్లికేట్ ఓటర్ ఐడీకార్డుల సమస్యను పరిష్కరించాం

## ఎన్నికల సంఘం

**బలగం టీవి, హైదరాబాద్**

ఇంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. ఎపిక్ నెంబర్లు.. ఓటరు ఐడీ నెంబర్లకు చెందిన 20 ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించినట్లు ఈసీఐ తెలిపింది. డూప్లికేట్ ఓటర్ ఐడెంటిటీ కార్డు నెంబర్ల సమస్యను పరిష్కరించినట్లు ఎన్నికల సంఘం పేర్కొన్నది. 2005 నుంచి వివిధ రాష్ట్రాలు.. ఓవర్‌లాపింగ్ ఆల్ఫాన్యూమరిక్ సిరీస్‌ను వాడుతోంది. దీని వల్ల ఆ సమస్య ఉత్పన్నమైనట్లు ఈసీ చెప్పింది. అయితే దేశవ్యాప్తంగా సుమారు 99 కోట్ల ఓటర్ల ఐడీ కార్డులను వెరిఫికేషన్ చేశామన్నారు. వీటిల్లో చాలా తక్కువ సంఖ్యలో డూప్లికేట్ ఓటర్ ఐడీ కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. అయితే ఆ కేసులన్నీ వాస్తవమైనవే అని, ఆ ఓటర్లకు అందరికీ కొత్త, విశిష్టమైన ఎపిక్ నెంబర్లతో ఐడీలు జారీ చేసినట్లు ఎన్నికల సంఘం పేర్కొన్నది. డూప్లికేట్ ఓటరు ఐడీ కార్డులతో ఓటింగ్‌లో ఎటువంటి సమస్య రాలేదని ఈసీ చెప్పింది. ఎందుకంటే సంబంధింత పోలింగ్ స్టేషన్‌లోనే ఓట్లు వేయడం వల్ల సమస్య రాలేదన్నది.

# వచ్చే ఐదు రోజులు వర్షాలు

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయనీ, బుధ, గురువారాల్లో పలు జిల్లాల్లో వడగండ్లతో కూడిన వాన పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. బుధవారం నాడు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గంటకు 50 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో పాటు వడగండ్ల వర్షం కురిసే అవకాశమున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఆ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కా జిగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే సూచనలున్న నేపథ్యంలో ఆ జిల్లాలకు కూడా ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరిక విడుదల చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు సాయంత్రం, రాత్రి వేళల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడే సూచనలు బలంగా ఉన్నాయి. మంగళవారం ఉదయం 8:30 నుంచి రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 30కిపైగా ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో అత్యధికంగా 2.15 సెంటీమీటర్ల వాన పడింది. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, హన్మ కొండ, జనగాం, వరంగల్, రాజన్నసిరిసిల్ల, ఖమ్మం, సిద్దిపేట, కరీంనగర్, కామారెడ్డి, నారాయణపేట, మెదక్, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, తదితర జిల్లాల్లో వర్షం కురిసింది.

అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. మంగళవారం నాడు దక్షిణ బంగాళాఖాతం, ఉత్తర అండమాన్ సముద్రం, నికోబార్ దీవుల్లోకి ప్రవేశిం చాయి. రాబోయే నాలుగు రోజుల పాటు నైరుతి రుతుపవనాలు మరింత పురోగమించి దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, దక్షిణ బంగాళా ఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు, అండమాన్ నికోబార్ దీవులకు పూర్తిగా విస్తరించే అవకాశముంది.

## కల్తీ మద్యం..17 మంది మృతి

**బలగం టీవి, హైదరాబాద్**

పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఘోర విషాదం చోటు చేసుకుంది. కల్తీ మద్యంతాగి 17 మంది మృత్యువాత పడ్డారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. సోమవారం అమృత్‌సర్ జిల్లాలోని మజితా బ్లాక్‌లోని భంగాలీ కలాన్, పాటల్‌పురి, థారీవాల్, సంఘ, మరారి కలన్ గ్రామాలకు చెందిన కొంతమంది ప్రజలు కల్తీ మద్యం తాగిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురయ్యారు. వారిని దగ్గరలోని అమృత్‌సర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 17 మంది చనిపోయారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న అమృత్‌సర్ డిప్యూటీ కమిషనర్ సాక్షి శాన్వే ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ మజితా బ్లాక్‌లో ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుందన్నారు. ఆదివారంనాడు రాత్రి తమకు సమాచరం వచ్చిందని, ద్యం తాగి 5 గ్రామాలకు చెందిన ప్రజలు అస్వస్థతకు గురైనట్లు తెలిసిందన్నారు. వెంటనే వైద్య బృందాలను గ్రామాలకు పంపి, చికిత్సకు ఉపక్రమించామన్నారు. మెడికల్ టీమ్స్ బాధిత గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఆరోగ్యం గురించి విచారిస్తున్నాయని తెలిపారు. అనారోగ్య లక్షణాలు ఉన్నా లేకపోయినా.. మద్యం తాగిన వారిని ఆస్పత్రికి తీసుకెళుతున్నట్లు వివరించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం అందిస్తోందన్నారు. పరిస్థతి విషమంగా ఉన్న ఆరుగురిని రక్షించడానికి డాక్టర్లు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నట్లు ఆమె తెలిపారు. మద్యం తాగి 17 మంది చనిపోయిన ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది. ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధ్యులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమన్నారు. అమాయకుల ప్రాణాలను బలిపెట్టిన వారిని చట్ట పరిధిలో కఠినంగా శిక్షిస్తామని ఆయన 'ఎక్స్' ద్వారా స్పష్టం చేశారు. మరోవైపు కల్తీ మద్యం ఘటన నేపథ్యంలో ఆప్ ప్రభుత్వంపై విపక్షాలు విరుచుకుపడ్డాయి.


# విప్పి కుప్ప పెట్టేది లేదు... విస్తరణ మాత్రమే...

**-శీఘ్ర దర్శనం కల్పించేలా ఏర్పాట్లు..**

**-ఆలయం మూసివేత తర్వాత భీమేశ్వర ఆలయంలో దర్శనాలు**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



శృంగేరి పీఠాధిపతుల సలహాలు సూచనల మేరకే రాజన్న ఆలయ అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఓ ప్రకటన లో తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆలయాన్ని విస్తరిస్తున్నామని, వచ్చే భక్తులకు శ్రీఘ్ర దర్శనాన్ని కల్పించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నామని అన్నారు. ఆలయాన్ని బందీ చేసి విస్తీర్ణ పనులు చేయబోమని, గర్భ గుడిలో నిత్యం పూజలు జరుగుతాయని అన్నారు. భక్తులకు భీమేశ్వరాలయంలో దర్శనాలు కల్పిస్తున్నామని తెలిపారు. దశాబ్ది కాలంగా వెనుకబడిన ఆలయ అభివృద్ధిని మేము చేస్తుంటే కొందరు వ్యక్తులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి ని కలసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

**బలగం టీవీ, వేములవాడ**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ హైదారాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిసారు ఈ సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఆలయ అభివృద్ధి పై, జిల్లాకు సంంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించడం జరిగిందని, ఆలయ అభివృద్ధికై ఇటీవల శృంగేరి పీఠం వెళ్లి అనుమతులు తీసుకొని రావడం జరిగిందని త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి కానున్నట్లు అది శ్రీనివాస్ తెలిపారు. కాగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరితగతిన అభివృద్ధి పనులు ప్రారంభించాల్సిందిగా సూచించారని అన్నారు.

# హిందు ఏక్తా యాత్ర వాల్ పోస్టర్ విడుదల



**వేములవాడ అర్బన్ మండల బిజెపి అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్**

**బలగం టీవీ, వేములవాడ**

బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల22 వ తేది గురువారం రోజున సాయంత్రం 4 గంటలకు కరింనగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే హిందు ఏక్తా యాత్ర విజయవంతం కావాలని అగ్రహారం ఆంజనేయ స్వామి సన్నిధానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి అందుకు సంబంధించిన వాల్ పోస్టర్ ను అవిష్కరించటం జరిగింది.హిందువుల ఐక్యత కోసం చేసే ఈ కార్యక్రమానికి అర్బన్ మండల ప్రజలందరు, హిందుబంధువులు హాజరుకావాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, రాష్ట్ర నాయకులు లింగపల్లి శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటేశ్వరరావు, నాయకులు ఏరెడ్డి రాజిరెడ్డి,జింక అనిల్,గుండెకర్ల లక్ష్మణ్,చంద్రగిరి ప్రశాంత్, నర్సింగోజు శంకర్, సంతోష్ యాదవ్, గొనె భాస్కర్, చల్ల నర్సయ్య,రెడ్డవెని శ్రీనివాస్, ఎరుగొక్కుల రమేష్, విశ్వనాధం శ్రీధర్, సంజీవ్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, తిప్పారవేని రాజు, కర్రె పవన్,ఎర్రం రమేష్, రెడ్డవెని రాజు, నాగుల సురేష్, కంసాని రాము, పేరంగాని మల్లేశం, పోచంపల్లి భాను, ముడికే రాములు, బొల్లు తిరుపతి, పెరుగు శంకర్,దేవరాజ్ ప్రశాంత్, పోతర్ల గణేష్,చెర్ల దేవరాజు,సోలంకి అరవింద్,చింతకుంట నర్సయ్య, దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్హత లేని వ్యక్తికి సిరిసిల్ల పట్టణ అధ్యక్ష పదవా..?

**- బీజేపీ సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి లికైలాస్ సిరస్వాల్**

**బలగం టీవీ, సిరిసిల్ల**




అర్హత లేని వ్యక్తికి సిరిసిల్ల పట్టణ బీజేపీ అధ్యక్ష పదవి ఇవ్వడం చాలా బాధాకరం అని బీజేపీ సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి కైలాస్ సిరస్వాల్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కైలాస్ సిరస్వాల్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కార్యకర్తలంగా భారతీయ జనతా పార్టీకి సేవలు అందిస్తున్నామని.. ఇలాంటి రాజకీయ పార్టీలో పనిచేయడం ఎంతో గర్వకారణం అని అన్నారు. కొంతమంది తమ అవసరాలు తీసుకోవడానికి పార్టీలోకి వచ్చారని, కష్టపడ్డ కార్యకర్తలకు కాకుండా కొత్తగా వచ్చిన వారికి పదవులు అప్పజెప్పడం ఎంత వరకు సమంజసమని అన్నారు. పార్టీలో కార్యకర్తల కంటే ఎక్కువ నమ్మకం ప్రజల్లో పార్టీ పైన ఉందని, బీజేపీ పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తను పార్టీ కచ్చితంగా గుర్తిస్తుందని ఒక గట్టి నమ్మకం కార్యకర్తల్లో మరియు ప్రజల్లో ఇమిడి ఉందని, కానీ పార్టీ పెద్దలు ఆ నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారని అన్నారు.పార్టీలో కొత్తగా చేరిన వారికి వారి వ్యక్తిగత చరిత్ర తెలుసుకోకుండా కేవలం డబ్బుల కోసమే పదవులను ఇస్తున్నారని ఆరోపించారు.నియమ నిబంధనలు పక్కనపెట్టి అసలే నామినేషన్ వెయ్యకుండా, కనీసం క్రియాశీల సభ్యత్వం లేని 49 సంవత్సరాల వయసులో ఉన్న వ్యక్తి పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం చాలా బాధాకరం అని, ఈ నియామకాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానమని అన్నారు.

దేశంలో నరేంద్ర మోడీ చరిష్మా ఏ విధంగానైతే ఉన్నదో,రానున్న స్థానిక ఎన్నికల్లో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చరిష్మా ఆ విధంగా పనిచేస్తుందని, కాబట్టి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఇట్టి నియామకంపై పునరాలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, లేదంటే పార్టీకి మరియు కార్యకర్తలకు చాలా నష్టం జరిగే అవకాశం ఉన్నదని అన్నారు ఈ కార్యక్రమంలో ఎనెగంటి నరేష్, బిజెపి నాయకులు మహేశుని అనిల్, డికొండ మహేందర్, కోడం బాలకిషన్, బొడ్డు సురేష్, దూడం సురేష్, దొంతరవేని మనోజ్ గౌడ్, వాసాల రాజాశేఖర్, లాహెూరే విక్రం, భాను, అనిల్, నరేష్, తదితరులు పాల్గొన్నారు



# పాలిసెట్ పరీక్ష ప్రశాంతం..

**95 శాతం మంది హాజరు..**

**బలగం టీవీ, సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో మంగళవారం పాలిసెట్ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా పరీక్షల కోఆర్డినేటర్ ప్రభాకరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల, సిరిసిల్ల బాలుర జూనియర్ కళాశాల, కుసుమ రామయ్య జడ్పీహెచ్ఎస్, గీతా నగర్ జడ్పిహెచ్ఎస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారం, జడ్పిహెచ్ఎస్ నెహ్రూ నగర్, జెడ్పిహెచ్ఎస్ తంగళ్ళపల్లిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 2,136 విద్యార్థులు పరీక్ష రాయాల్సిఉండగా, 2,027 మంది హాజరు అయినట్లు బాలురు 894 మంది, బాలికలు 1,133 మంది కలిపి మొత్తం 2,027 మంది, 94.89 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు.

**పాలిసెట్ ప్రవేశ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తంగళ్ళపల్లి,గీతా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న టి.జి.పాలిసెట్ - 2025 ఎంట్రెన్స్ ఎగ్జామ్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ఈ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల తరగతి గదులన్నింటిని తిరిగి పరీక్ష విధానాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన సీ.సీ.టి.వి. కెమెరాలు పనితీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష సజావుగా ప్రశాంతంగా జరుగుతుందని తెలిపారు.

తంగళ్ళపల్లి జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ శంకర్ నారాయణ ఆదేశించినారు. అదే విధంగా పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరునకు మోటర్ ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ కోరగా పంచాయతీ సెక్రటరీకి ప్రతిపాదనలు సమర్పించవలసిందిగా ప్రిన్సిపల్ కు తెలిపారు.ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట (ప్రిన్సిపాల్) చీఫ్ సూపర్డెంట్లు శంకర్ నారాయణ, శారద, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## రాజన్న ఆలయంపై వస్తున్న వదంతులను నమ్మకండి..

**-ఆలయం మూసివేత ఇప్పట్లో లేదు**

**-రాజన్న ఆలయ ఈఓ కె.వినోద్**

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ రాజన్న ఆలయం మూసివేత ఇప్పట్లో లేదని,జూన్ 15న రాజన్న రాజన్న ఆలయం మూసి వేస్తున్నట్లు వస్తున్న వదంతులను నమ్మవద్దని ఈవో వినోద్ రెడ్డి అన్నారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజన్న ఆలయ ఈఓ కె.వినోద్ మాట్లాడుతూ రాజన్న ఆలయం మూసివేత పై వస్తున్నా ఆరోపణలు అది కేవలం అపోహలు మాత్రమేనని అన్నారు.రాజన్న ఆలయ పునర్నిర్మాణ పనులు చేపడితే ముందుగా వచ్చేటటువంటి భక్తులకు భీమేశ్వర ఆలయంలో సకల సౌకర్యాలు ఏర్పాటు చేసిన తర్వాతే అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామనిఅన్నారు. శృంగేరి పీఠాధిపతి అనుమతులు, దేవాదాయ ధర్మదాయ శాఖ సలహాలు సూచనలు, రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు, స్థానిక ఎమ్మెల్యే కృషితో ఆలయాన్ని సర్వంగ సుందరంగా తీర్చిదిద్దబోతున్నట్లు దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఆలయ నిర్మాణ పనులు ఎప్పుడు చేపడతామన్నది మరికొద్ది రోజుల్లోనే మీడియా ముందు స్పష్టత ఇస్తామని అన్నారు.

## నేడు రామప్ప ఆలయానికి సుందరీమణులు

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణలో జరుగనున్న ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చిన సుందరీమణులు రాష్ట్ర ఘన చరిత్ర, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటేలా వీరి పర్యటనకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ పర్యటనలో భాగంగా ప్రపంచ దేశాల సుందరీమణులు తెలంగాణ లోని పలు చారిత్రక కట్టడాలు, ప్రసిద్ధ ప్రదేశాలను సందర్శిస్తున్నారు. ఈ మేరకు బుధవారం వారంతా యునెస్కో గుర్తింపు పొందిన చారిత్రక రామప్ప దేవాలయాన్ని దర్శించుకోనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణకు విచ్చేసిన ఈ అందగత్తెలకు సాదర స్వాగతం పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, చారిత్రక వైభవాన్ని వారికి పరిచయం చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ పర్యాటక రంగానికి మరింత ప్రచారం లభిస్తుందని భావిస్తున్నారు.

## వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ జట్టును ప్రకటించిన ఆస్ట్రేలియా

**బలగం టీవీ, హైదరాబాద్**



జూన్‌లో లార్డ్స్‌లో జరగనున్న వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌కోసం ఆస్ట్రేలియా క్రికెట్ జట్టును ప్రకటించారు.బ్యాటర్ సామ్ కోన్‌స్టాస్‌కు స్థానం కల్పించారు. స్పిన్నర్ మాట్ కుహనేమాన్, సౌత్ ఆస్ట్రేలియా స్పీడ్ బౌలర్ బ్రెండన్ డగెట్ కూడా ట్రావెల్ రిజర్వ్ ప్లేయర్ల జాబితాలో ఉన్నారు. మొత్తం 16 మంది సభ్యులు ఉన్న బృందాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా మంగళవారం ప్రకటించింది. లార్డ్స్‌లో జరగనున్న వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో సౌతాఫ్రికాతో ఆస్ట్రేలియా తలపడుతుంది. ఆ మ్యాచ్ ముగిసిన తర్వాత వెస్టిండీస్ టూర్‌కు ఆసీస్ వెళ్తుంది. అక్కడ జూన్, జూలై నెలల్లో మూడు టెస్టుల మ్యాచ్‌ల సిరీస్ ఉంటుంది. ఆస్ట్రేలియా జట్టుకు ప్యాట్ కమ్మిన్స్ కెప్టెన్‌గా మళ్లీ బాధ్యతలు చేపట్టనున్నాడు. శ్రీలంకతో జరిగిన టూరులో కెప్టెన్సీ నుంచి దూరంగా ఉన్న అతను ఇప్పుడు మళ్లీ ఆ రోల్ పోషించనున్నాడు. తోటి టెస్టు క్రికెటర్లు జోష్ హేజిల్‌వుడ్, కెమరూన్ గ్రీన్ కూడా మళ్లీ జట్టులో కలవనున్నారు. అయితే తుది జట్టులో స్థానం కోసం గ్రీన్, బూ వెబ్‌స్టర్ మధ్య పోటీ ఉండే అవకాశం ఉన్నది. ప్రస్తుతం హేజిల్‌వుడ్‌కు కాస్త భుజం నొప్పి ఉన్నా.. అతను ఫైనల్ వరకు కోలుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జూన్ 11వ తేదీన టెస్ట్ చాంపియన్షిప్ ఫైనల్ ప్రారంభంకానున్నది.

## బోపన్న జోడీ నిష్క్రమణ

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్నకు చుక్కెదురైంది. రోమ్ మాస్టర్స్ రెండో రౌండ్‌లో అదరగొట్టిన బోపన్న, ఆడమ్ పవ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) జోడీ.. అనూహ్యంగా మూడో రౌండ్‌లో ఓటమి పాలైంది. మంగళవారం జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో బ్రిటన్‌కు చెందిన జో సలిబరీ, నీల్ స్క్యూపస్కీ ద్వయం.. బోపన్న జంటకు చెక్ పెట్టింది. గంట 8 నిమిషాల పాటు సాగిన పోరులో బ్రిటన్ ఆటగాళ్లు ఆధిపత్యం చెలాయించారు. దాంతో, వరుస సెట్లలో వెనకబడిన బోపన్న, ఆడమ్ 3-6, 3-6తో మ్యాచ్ చేజార్చుకున్నారు. బోపన్న ఇంటిదారి పట్టడంతో ఈ టోర్నీ భారత పోరాటం ముగిసింది.ఈ టోర్నీలో భారత యువ ఆటగాడు యుకీ బాంబ్రీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. అమెరికా ప్లేయర్ రాబర్ట్ గాల్లోవేతో బరిలోకి దిగిన బాంబ్రీ తీవ్రంగా నిరాశపరిచాడు. నాలుగో సీడ్ మార్సెల్ గ్రానొల్లెర్స్(స్పెయిన్), హొరాసియో జెబల్లోస్(అర్జెంటీనా) ద్వయం జోరు ముందు నిలవలేకపోయారు. దాంతో బాంబ్రీ, రాబర్ట్ జోడీకి 1-6, 2-6తో ఓటమి తప్పలేదు.

## జూలై 4న 3 బీహెచ్‌కే

**బలగం టీవీ, హైదరాబాద్**




సిద్ధార్థ్ హీరోగా రూపొందుతోన్న ఫ్యామిలీ ఎంటైర్టైనర్ '3 బీహెచ్‌కే శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు కీలక పాత్రధారులు. శ్రీగణేశ్ దర్శకుడు. శాంతి టాకీస్ పతాకంపై అరుణ్‌విశ్వ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్‌కి మంచి స్పందన వచ్చిందని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటించారు. జూలై 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని బ్యూటిఫుల్ ఫ్యామిలీగా ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే పూర్తి కమర్షియల్ సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. మీతా రఘునాథ్, చైత్ర తదితరులు తారాగణం.

## సితారే జమీన్ పర్ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




అమీర్‌ఖాన్ ప్రధాన పాత్రలో 2007లో విడుదలై సంచలన విజయం సాధించడంతో పాటు విమర్శకుల ప్రశంసలు పొంది క్లాసిక్ చిత్రాల జాబితాలో చేరిన తారే జమీన్ ఫర్ సినిమాకు సీక్వెల్‌గా రూపొందించిన సినిమా సితారే జమీన్ ఫర్. జెనీలియా దేశ్‌ముఖ్ కీలక పాత్ర పోషించింది. 2018లో స్పానిష్‌లో వచ్చిన ఛాంపియన్స్ మూవీ ఆధారంగా హిందీలో రూపొందించిన ఈ సినిమాకు దివ్య నిధి శర్మ కథ అందించగా ప్రసన్న దర్శకత్వం వహించాడు. అమీర్ ఖాన్ స్వయంగా నిర్మించాడు. జూన్ 20న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మంగళవారం ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు.

# చార్మినార్ వద్ద సుందరాంగుల హెరిటేజ్ వాక్

**- ప్రపంచ ప్రఖ్యాత చార్మినార్ వద్ద చేరుకున్న 109 దేశాల మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్.**

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రపంచ ప్రఖ్యాత చార్మినార్ సందర్శన 109 దేశాల మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ కు అద్భుతమైన మధురానుభూతులను మిగిల్చింది. ఐదు శతాబ్దాలుగా హైదరాబాద్ మధ్యన ఠీవిగా నిలబడి ఉన్న ఈ సొగసైన కట్టడం ను చూసి సుందరాంగులు మంత్రముగ్ధులయ్యారు. సందర్శన కోసం చార్మినార్ వద్దకు పర్యాటక బస్సులతో చేరుకున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లకు అధికారులు రెడ్ కార్పెట్ స్వాగతం పలికారు.

స్థానిక కళాకారులు వారికి సాంప్రదాయిక అరబ్బీ మార్ఫా వాయిద్యాలతో స్వాగతం పలికారు. మార్ఫా శబ్దాలతో మమేకం చేస్తున్నట్లుగా కొందరు కంటెస్టెంట్స్ ప్రత్యేక స్టెప్పులతో నృత్యం చేసి, స్థానిక సంస్కృతికి అనుకూలంగా తాము అనునయించారు.

ఈ అందాల రాయబారులతో చార్మినార్ పరిసరాలు ఒక సరికొత్త శోభను పొందాయి. ప్రత్యేకంగా చార్మినార్ వద్ద ఫోటోషూట్ కు హాజరైన సుందరాంగులు, ఈ చారిత్రాత్మిక వేదిక నుండి ప్రజలకు అభివాదం చేస్తూ, తమ ఆనందం, సంతోషాన్ని వ్యక్తం చేశారు. చార్మినార్ అందాలను ఈ అందగత్తెలు తమ చరవాణులలో ఫోటోలను తీసుకున్నారు. అనంతరం ప్రపంచ అందగత్తెలు చార్మినార్ ముందు నిర్వహించిన హెరిటేజ్ వాక్ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి తెలిపారు.

సందర్శనలో భాగంగా, చార్మినార్ సమీపంలోని ప్రసిద్ధ చుడీ బజార్ (లాడ్ బజార్)లో కంటెస్టెంట్స్ గాజులు, ముత్యాల హారాలు మరియు ఇతర అలంకరణ వస్తువుల షాపింగ్ చేసి, స్థానిక హస్తకళల పట్ల ఆసక్తిని ప్రదర్శించారు. కొందరు కంటెస్టెంట్స్ గాజుల తయారీ ప్రక్రియను స్వయంగా పరిశీలించి, నిపుణులైన కారిగర్లు (కళాకారులు), శిల్పులకు ప్రశంసలు తెలిపారు. వారి శ్రమ , నైపుణ్యం ప్రపంచ స్టేజిపై కూడా గుర్తించదగినదని భావించారు. ఈ కార్యక్రమం ద్వారా, హైదరాబాద్ యొక్క సాంస్కృతిక వారసత్వం మరియు సౌందర్యం ప్రపంచానికి తెలియజేసినట్లయ్యింది. మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ సందర్శన కేవలం పోటీలలో భాగంగానే కాకుండా, ప్రపంచ శాంతి ,సాంస్కృతిక సామరస్యానికి సాక్ష్యంగా నిలిచింది.

**చౌమహల్లా ప్యాలెస్ లోపల సందర్శించిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు.**

నిజాం వంశస్థుల రాజ సింహాసనం, వారు వాడిన వస్తువులు, సైనిక సామాగ్రి, వంట సామాగ్రిని ఆసక్తిగా గమనించిన మిస్ వరల్డ్ ప్రతినిధులు.చౌముల్లా ప్యాలెస్ 300 సంవత్సరాల చరిత్రను, విశిష్టతను తెలుసుకున్న మిస్ వరల్డ్ ప్రతినిధులు.




## ప్రైమ్‌లోనూ యాడ్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఇండియాలోని తమ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. జూన్ 17వ తేదీ నుంచి సినిమాలు మరియు టీవీ షోల మధ్యలో ప్రకటనలను ప్రసారం చేయనున్నట్లు అమెజాన్ అధికారికంగా ప్రకటించింది. ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయంతో కంటెంట్‌పై మరింత పెట్టుబడి పెట్టాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. అయితే, ప్రకటనలు చూడటానికి ఇష్టపడని వినియోగదారుల కోసం ఒక ప్రత్యేకమైన యాడ్-ఫ్రీ ప్లాన్‌ను కూడా అమెజాన్ అందుబాటులోకి తీసుకురానుంది. ఈ యాడ్-ఫ్రీ ప్లాన్‌ను ఎంచుకోవడానికి వినియోగదారులు అదనంగా రుసుము చెల్లించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో తెలియనున్నాయి. ప్రస్తుతానికి ఉన్న అమెజాన్ ప్రైమ్ మెంబర్‌షిప్ ధరలో ఎలాంటి మార్పు ఉండదని అమెజాన్ స్పష్టం చేసింది. ప్రకటనలతో కూడిన కంటెంట్‌ను చూడటానికి అభ్యంతరం లేనివారు ప్రస్తుత ప్లాన్‌తోనే కొనసాగవచ్చు. అయితే, ప్రకటనలు లేకుండా చూడాలనుకునేవారు అదనపు రుసుముతో కొత్త ప్లాన్‌కు మారాల్సి ఉంటుంది. ఈ కొత్త ప్లాన్ నెలవారీగా రూ. 129 లేదా ఏడాదికి రూ. 699 ఉండవచ్చని తెలుస్తోంది.




## 'కుమారి 21ఎఫ్ రీరిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ తన సొంత ప్రొడక్షన్ హౌజ్ సుకుమార్ రైటింగ్స్‌పై ప్రొడ్యూస్ చేసిన తొలి చిత్రం 'కుమారి 21ఎఫ. రాజ్ తరుణ్, హెబ్బా పటేల్ జంటగా నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ మూవీగా నిలిచింది. ఈ సినిమాను దర్శకుడు పల్నాటి సూర్యప్రతాప్ డైరెక్ట్ చేయగా దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఇక 2015లో వచ్చిన ఈ సినిమా రిలీజ్ అయ్యి పదేళ్లు అవుతుండటంతో చిత్ర యూనిట్ సెలబ్రేషన్స్ ప్లాన్ చేస్తుంది. అంతేగాక, ఈ చిత్రాన్ని గ్రాండ్ రీ-రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించారు. దీంతో 'కుమారి 21 ఎఫ్ రీ-రిలీజ్ ఎప్పుడు ఉండబోతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

## రాంగ్ రూట్‌లో కారును నడిపిననటుడు బెల్లంకొండ శ్రీనివాస్ ..!

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ యువ కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వార్తల్లో నిలిచారు. ఆయన రాంగ్ రూట్‌లో కారు నడుపుతూ పోలీసులకు చిక్కడం, ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో ఈ ఘటన చర్చనీయాంశమైంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీ ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బెల్లంకొండ శ్రీనివాస్ స్వయంగా తన కారును నడుపుకుంటూ రాంగ్ రూట్‌లో దూసుకొచ్చారు. ఆ సమయంలో అక్కడే విధుల్లో ఉన్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్, నిబంధనలకు విరుద్ధంగా వస్తున్న కారును గమనించి వెంటనే అడ్డుకున్నారు. కానిస్టేబుల్, కారు నడుపుతున్నది హీరో బెల్లంకొండ శ్రీనివాస్ అని గుర్తించి, రాంగ్ రూట్‌లో ఎందుకు ప్రయాణిస్తున్నారని ప్రశ్నించారు. దీంతో శ్రీనివాస్ తన వాహనాన్ని అక్కడి నుంచి వెనక్కి తీసుకుని వెళ్లిపోయారు. ఈ ఘటన మొత్తాన్ని అక్కడున్న కొందరు వ్యక్తులు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో క్లిప్‌లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.